గడ్డికి.. గడ్డు కాలం

యాసంగి వరిసాగులో నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోయాయి. వరుస తడులతో పంటలను కాపాడుకున్న రైతులకు దిగుబగి రాలేదు. పంట దిగుబడి ఇలా ఉంటే, వరిచేలను యంత్రాలతో కోతలు చేపట్టడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. ట్రాక్టర్ గ్రాసానికి సుమారు రూ.4 నుంచి 6 వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పశుగ్రాసం కొరత కారణంగా దాని ప్రభావం పశుపోషణపై పడింది. దీంతో పశుపోషణ వారికి గుదిబండగా మారింది.

యాసంగి సాగులో నీటిఎద్దడి

- ఎండిన వరి పంటలు
- యంత్రాల వినియోగంతో గడ్డికి కొరత
- పశుగ్రాసం ధరలకు రెక్కలు
- పశుపోషణ భారమంటున్న రైతులు



పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న రైతులు

కోహెడ(హుస్నాబాద్): మండల వ్యాప్తంగా యాసంగిలో 21 వేల ఎకరాల్లో వరిసాగైంది. మొక్కజొన్న 350 ఎకరాల్లో సాగు చేశారు. మొగిపురుగు, నీటి ఎద్దడితో వరి 950 ఎకరాలు, మొక్కజొన్న 25 ఎకరాలు పోయిందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. రైతులు హార్వెస్టర్లతో వరి కోతలు చేపట్టడంతో పశుగ్రాసానికి కొరత మరింత పెరిగింది. అధికారుల లెక్కల ప్రకారం పశువులు, గేదెలు మండల వ్యాప్తంగా సుమారుగా 9500 ఉన్నాయి. ప్రతీ రోజు ఒక్కొక్క పశువుకు దాదాపుగా ఐదు కిలోల పశుగ్రాసం అవసరం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. పశుగ్రాసం ధరలకు రెక్కలు రావడంతో పశువుల పోషణ భారంగా ఉందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పశుపోషణపై కూడా దృష్టిసారించాలని కోరుతున్నారు.

రైతుల చూపు పాల ఉత్పత్తి వైపు

గత ఏడాది వానాకాలం పంటల సాగులో రైతులు ఆశించినంత వర్షాలు కురవకపోవటంతో ఇటీవల యాసంగి సాగు భారమైంది. దీంతో చేతికందే దశలో బావుల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో వరి చేను వందల ఎకరాల్లో ఎండుముఖం పట్టింది. దీంతో రైతులు పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించారు. ఈ కారణంగా పశుగ్రాసంతో పాటు పాడి పశువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేయాలి



అధికారులు పశుగ్రాసం కొరతను దృష్టిలో ఉంచుకొని పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయాలి. బోరుబావులు, బావులు మంజూరు చేయాలి. నీటి వెదజల్లు, బిందు సేద్యం పరికరాలు సబ్సిడీపై అందిందించాలి. పాడిరైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– గడ్డం ఆదిరెడ్డి, పాడి రైతు, కోహెడ

ఉన్నతాధికారులకు నివేదించాం



యాసంగిలో నీటి ఎద్దడితో వరి పంటలు ఎండిపోయి గడ్డికి కొరత ఏర్పడిన విషయం వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. మండలానికి పశువుల మేత కోసం ఎస్ఎస్‌జీ మొక్కజొన్న సబ్సిడీ విత్తనాలు మంజూరు కోసం 3 క్వింటాళ్ల అవసం ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. పాడిరైతులు ఆందోళన చెందొద్దు.

– శ్రావణ్, పశువైద్యాధికారి, కోహెడ



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై ధర్నా చేస్తున్న రైతులు, అఖిల పక్ష నాయకులు

అక్రమ నీటి విడుదలను ఆపాలి

రైతులు, అఖిలపక్ష నాయకుల ధర్నా

హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు తూము నుంచి అక్రమంగా విడుదల చేస్తున్న నీటిని ఆపాలని అఖిలపక్ష నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. చేపలు పట్టే కాంట్రాక్టర్ అధికారుల అనుమతి లేకుండా తూము ద్వారా నీటిని విడుదల చేయడం సరికాదన్నారు. వేసవిలో చెరువులో నీటి మట్టం పూర్తిగా తగ్గుతుందని, దీనికి తోడు నీటిని విడుదల చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటిని వదులుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ చెరువు ద్వారా రైతులకు సాగునీరు అందడమే కాకుండా హుస్నాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. చెరువులో చేపలు పట్టుకోవడానికి తాము వ్యతిరేకం కాదని, నీటిని విడుదల చేయకుండా చేపలు పట్టుకోవాలన్నారు.

వలలు చిక్కుకుంటున్నాయి

చెరువు నిండా ముళ్ల కంపలు ఉన్నాయని, వలలు వేస్తే అవి కంపలకు చిక్కుకొని చిరిగిపోతున్నాయని మత్స్యకారుల సంఘం నాయకులు తెలిపారు. చెరువు కట్ట వద్దకు వచ్చిన మత్స్యకారులు, రైతులు, అఖిల పక్షనాయకులతో మాట్లాడారు. ముళ్ల కంపలు ఉండటం వల్ల చేపలు పట్టుకునే అవకాశం లేదన్నారు. దాదాపు ఆరేళ్లుగా ముళ్ల కంపలు తీయలేదన్నారు. ఒక అడుగు నీటిని విడుదల చేస్తే కంపలను పూర్తిగా తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. చేపలే తమకు జీవనాధారమని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొలిశెట్టి సుధాకర్, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, అయిలేని శంకర్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, వేణుగోపాల్ రెడ్డి, రాజయ్య, బత్తుల శంకర్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన జిల్లా నాయకులు



మంత్రి సీతక్కతో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసినట్లు సిద్దిపేట అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిమి భిక్షపతి తెలిపారు. మంత్రిని కలిసినవారిలో నాయకులు దాస అంజయ్య, బాలకృష్ణ, పర్శ రాములు, కనుకయ్య తదితరులు ఉన్నట్లు చెప్పారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం నంగునూరు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని సిద్దిపేట టౌన్ ఏడీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని సిబ్బందికి వినియోగదారులు సహకరించాలన్నారు.

ఉగ్ర వీరం పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు ధర్మపురి శ్రీనివాస్, బుడిగె గురవయ్య శుక్రవారం లక్ష్మీ నర్సింహస్వామి వారి ఉగ్రరూపం పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ఈ పుస్తకాలను ప్రముఖ ఆలయాల వద్ద పొన్నాల అరుణదేవి లక్ష్మయ్య సౌజన్యంతో భక్తులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాగమల్ల శ్రీనివాస్, సాడ మహేష్, తుంగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో శుక్రవారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. శోభయాత్రలో హనుమాన్ మాలధారులు రామనామ కీర్తనలు పాడారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అలాగే శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని చిన్నకోడూరులోని శేరుపల్లి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్వాములు హనుమాన్ దీక్ష విరమణ చేయనున్నందున నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామ్మోహన్

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం దూళ్మిట్ట మండల కేంద్రంతోపాటు లింగాపూర్ గ్రామంలోని పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా అమ్మ ఆదర్శ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, పీఆర్ఏఈ వినయ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

దుబ్బాక నుంచి యాదాద్రికి ఎక్స్‌ప్రెస్ బస్సు

దుబ్బాకటౌన్: తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన యాదాద్రికి (యాదగిరి గుట్టకు) దుబ్బాక నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు దుబ్బాక ఇన్‌చార్జి డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి బస్సు సర్వీసు అందుబాటులోకి వస్తుందన్నారు. ఉదయం 5 గంటలకు దుబ్బాక నుంచి బయలుదేరి సిద్దిపేట, చేర్యాల మీదుగా యాదగిరి గుట్టకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంతటా దుర్గంధం

- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు
- జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు బేఖాతరు



అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పారబోసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని పలు కాలనీలు దుర్గంధం వెదజల్లుతోంది. తహసీల్దార్ కార్యాలయం, రైతు వేదిక సమీప ప్రదేశాలు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారానికి నిలయంగా మారాయి. ఎటుచూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్‌ను నిషేధించాలని జిల్లా పంచాయితీ అధికారి(డీపీఓ) ఆదేశాలు ఇచ్చిన తమకేమీ పట్టనట్లు సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎస్సీ కాలనీల్లోని కాలువలు పూడికుపోయి రోడ్లపైకి మురుగు చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో రోగాలు ప్రబలుతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోనే పారిశుద్ధ్యం ఇలా ఉంటే గ్రామాల్లో ఏస్థాయిలో ఉందో అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంజనేయస్వామి ఆలయం ముస్తాబు



శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయం

గజ్వేల్‌రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు కట్ట సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి విఠాల సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో చాడ నందబాలశర్మ, చాడ బాలేందుమౌళిశర్మల వైదిక నిర్వహణలో ఆలయంలో సుప్రభాత సేవ, గణపతి పూజ, స్వస్తి వాచనము, దేవతా ఆహ్వానము, అష్టోత్తర శత మన్యుసూక్తం, అభిషేకం, పంచ కుండాత్మక శ్రీ హనుమత్ మూలమంత్ర హోమం, మూల విరాట్‌కు ప్రత్యేక ఫలపుష్పాలతో అలంకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

రిటైర్‌మెంట్ వృత్తికే వ్యక్తిత్వానికి కాదు

సిద్దిపేట సీపీ అనురాధ



లక్ష్మణ్‌ను అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పోలీసు రిటైర్‌మెంట్ కేవలం వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన లక్ష్మణ్‌ను శుక్రవారం సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొంది సక్రమంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



చిన్నకోడూరులో విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ పద్మ



లక్ష్మీదేవిపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రమణి, ఎస్ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేటరూరల్: రైతులకు కల్తీ విత్తనాలను అమ్మితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అపూర్వరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని విత్తన దుకాణాలను ఎస్ఐ అపూర్వరెడ్డి, మండల వ్యవసాయ అధికారి రమణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కల్తీ విత్తనాలు అమ్మినా, విత్తనాల కొరత సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాల కొరత లేదని, ఎటువంటి వదంతులు నమ్మొద్దన్నారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా విత్తన విక్రయ రిజిష్టర్లు, బిల్‌బుక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పరమేశ్వరీ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే..

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు, విఠలాపూర్ గ్రామాల్లోని విత్తనాలు, పురుగు మందుల షాపుల్లో శుక్రవారం ఏడీఏ పద్మ, మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లు, విత్తనాలు, పురుగుల మందులు బస్తాలను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు రైతులకు విక్రయించకూడదన్నారు. విత్తనాల కొనుగోలు బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు.

2న ఖోఖో అసోసియేషన్ సమావేశం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అంతర్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ రవికుమార్ తెలిపారు. అసోసియేషన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

బీటీ2 పత్తి విత్తనాలన్నీ దిగుబడి ఇస్తాయి

బెజ్జంకి(సిద్దిపేట): బీటీ 2 రకం పత్తి విత్తనాలన్నీ దిగుబడినిస్తాయని బెజ్జంకి ఏఓ సంతోష్ శుక్రవారం తెలిపారు. ఒకే కంపెనీ, ఒకే రకం విత్తనాల కోసం రైతులు డిమాండ్ చేస్తే మార్కెట్‌లో కృత్రిమ కొరత ఏర్పడుతుందన్నారు. సాగు విధానాలతో పత్తి దిగుబడులు ఆధారపడివుంటాయన్నారు. అందుబాటులో ఉన్న బీటీ2 రకం విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలకు కొరత లేదన్నారు. మండలంలో సీడ్స్ షాప్‌ల రికార్డు ప్రకారం 9200 పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. స్టాక్ ఎప్పటి కప్పుడు వస్తుందని తెలిపారు. లైసెన్స్‌లున్న దుకాణాల్లో కొనుగోలు చేయాలన్నారు.

నేటి నుంచి కాళీమాత ఆలయ వార్షికోత్సవం



గాగ్గిళ్లాపూర్‌లో కాళీమాత ఆలయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగ్గిళ్లాపూర్ కాళీమాత ఆశ్రమంలో పరమయోగిని కాళీమాత ఆధ్వర్యంలో నేటి నుంచి కాళీమాత ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వార్షికోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అఖండ దీపారాధన, సర్వదేవత పూజ, కాళీమాతకు అభిషేకం, మహారుద్రచండి యాగం, కుంకుమార్చన, లక్ష పుష్పార్చన, పరమయోగిని కాళీమాత పాదపూజ, 2న సర్వదేవతపూజ, కాళీమాతకు అభిషేకం, మహారుద్ర చండీయాగం, కుంకుమార్చన, పరమయోగి కాళీమాత జన్మదినం పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్



నియామక పత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన పొన్నాల రాజేష్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం చిన్నకోడూరులో జరిగిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌తోనే బడుగు బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు, మండల అధ్యక్షుడు మహేందర్ యాదవ్, నాయకులు పర్శరామ్, రాజు, గణేష్, ప్రశాంత్, నాగరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బడిబాటను విజయవంతం చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బడిబాటను విజయవంతం చేయాలని ఎంపీడీఓ యాదగిరి, మండల నోడల్ అధికారి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలోని వివిధ శాఖల అధికారులతో బడిబాట కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 3వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. బడిబాటలో గ్రామాల్లోని అన్ని శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొనాలని కోరారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, అధికారులు రజిత, సునీత, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం మండల కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ యాదగిరి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ ఏడాది కాలంగా పంచాయతీలకు నిధులు రాక నిర్వహణ కష్టంగా మారిందన్నారు. పంచాయతీలకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. వివిధ పనులకు సొంతంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ మృతుల కుటుంబాలకు పరామర్శ

గజ్వేల్‌రూరల్: ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి శనివారం ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి పరామర్శించారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన నరేష్‌చారి , బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నిజాముద్దీన్ తండ్రి మహ్మద్ నజీర్ మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

◆ పనుల్లో పారదర్శకత లోపించొద్దు

కొండపాక(గజ్వేల్): పనుల్లో పారదర్శకత లోపించొద్దని టీఎస్ ఈడబ్ల్యూడీసీ చీఫ్ ఇంజనీర్ అనిల్ కుమార్ హెచ్చరించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాఠశాలల్లో కనీస వసతుల కల్పన అమ్మ ఆదర్శ కమిటీ పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు నరేందర్, డిప్యూటీ ఇంజనీర్ మక్బూల్, ఏఈఈ రాజు, హెచ్ఎం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంఈఓ జోగు ప్రభుదాసు కోరారు. శుక్రవారం మిరుదొడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఈనెల 3 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేష్ రెడ్డి, మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాములు, సూపరింటెండెంట్ నారాయణ, సీఆర్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న టెట్ పరీక్ష

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న టెట్ పరీక్షకు శుక్రవారం 87 మంది హాజరయ్యారు. సీబీటీ విధానంలో పరీక్ష రోజుకు రెండు సెషన్లుగా నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 45 మంది, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు నిర్వహించిన సెషన్‌కు 42 మంది హాజరయ్యారు. పరీక్షలు జూన్ 2 వరకు కొనసాగనున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ నాగభూషణం, టీసీఎస్ ఆఫీసర్ రాకేష్, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా, డీపీ రావు, రాజేశ్వర్ పర్యవేక్షించారు.

◆ అహ్మదీపూర్ ఘటనపై కేసు నమోదు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నరేష్‌చారి మృతిపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. నరేష్‌చారి శుక్రవారం తమ ఇంటి ఎదురుగా ఉండే ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటంతో హత్య చేయబడినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.